అంతరంగ సంఘర్షణ

"చూడండీ! మొన్న ప్రక్కింటావిడ పేరంటానికి కట్టుకొచ్చిందండీ చక్కటి జరీ చీర! కెంపులాంటి ఎఱ్ఱటి రంగు! దానిమీద జరీ కళ్ళు చెదిరేట్టు ఎలా మెరుస్తున్నదనుకున్నారూ? అట్టే ఖరీదు కూడా లేదండీ! పాతిక రూపాయిలేనట! నాకలాటిది ఒకటి కొనియ్యరూ?" మెల్లగా గోముగా జంకుతూ అడిగింది వనజ.

సురేష్ వనజకేసి తీవ్రంగా చూశాడు. "మీ ఆడవాళ్ళకు ఎంతసేపూ ఇదేపని! ఆ అచ్చమ్మ మంచి చీరకట్టుకుని రావడం భయం ఈ పిచ్చమ్మ కొత్తనగ వేసుకోవటం భయం మా మొగవాళ్ళ మీదికి వచ్చి విఱుచుకు పడతారు. మొగవాళ్లను వేధించటం తప్ప మీకేం పనిలేదు! పాతిక రూపాయిలు నీ కంటికి మహా చవగ్గా కన్పిస్తున్నాయి కాబోలు, నాదగ్గఱ ఇప్పుడు కాని కూడా లేదు-నేనిప్పట్లో ఏ చీరా కొనను, కొన దలచుకోలేదు!" అని సిగరెట్టునుసి దులుపుతు సురేష్ ఖచ్చితంగా చెప్పాడు.

వనజ చిన్నబోయింది. అభిమానంతో, రోషంతో కళ్ళంట నీళ్ళు తిరిగాయి. తనేమంత పట్టుచీరలు కొనమన్నదని? వందలు పెట్టి కొనమన్నదా, వేలు పెట్టి కొనమన్నదా విసుక్కోవటానికి? అడుగులకు మడుగు లొత్తుతున్నా, మగవాళ్ళు అధికారం చెలాయించి, ఈసడించి కొడుతూనే వుంటారు! తన సరదాలను తీర్చమని భర్తను కాకపోతే మరెవరి నడుగుతుంది? వాళ్ళకిష్టమైన వాటి కన్నిటికీ బాగానే ఖర్చు పెట్టుకుంటారు! ఇవతల వాళ్ళకూ కూడా వాళ్ళలానే సరదాలుంటాయని ఎందుకనుకోరో మరి? ఆర్థిక స్వాతంత్ర్యం లేక పోబట్టేగా ఆడదానికిన్ని తిప్పలూ మొగవాళ్లు కసిరి కొట్టటమూనూ— ప్రతి చిన్న విషయానికి చేతులు సాచవలసి రావటంవల్లనేగా మగవాళ్ళ కింత అలుసు! హాయిగా చదువుకుని వుద్యోగం చేసుకుంటే బాగుండిపోను!

వనజ కళ్ళంట నీళ్లు పెట్టుకుంటూ గిరుక్కున ఇంట్లోకి వెళ్ళిపోయింది. మంచం మీద బోర్లా పడుకుని మనస్సుకు శాంతి లభించేంత వరకూ కన్నీళ్ళు కార్చింది. వ్యథా పూరితమైన మనస్సుతో అలా ఎంతసేపు ఏడుస్తూ పడుకుందో! అత్తగారి కేక విని వనజ త్రుళ్ళిపడి లేచింది.

"బాగుందమ్మా! ఇలా నువ్విక్కడ మంచం ఎక్కి కూర్చుంటే అవతల వంటంతా ఎవరు చేస్తారనుకున్నావు తల్లీ? ఈ నాజూకులు మా ఇంటిదగ్గఱ పనికి రావమ్మా లేలే!"

వనజ మనసు తిరుగుబాటు చేసింది. మాట్లాడకుండా లేచి తనపెట్టె గబగబా సర్దుకుని వీధి గుమ్మంలోకి వెళ్ళి రిక్షాను పిలిచింది. అత్తగారు తెల్లబోయి చూస్తూ నించుంది కొన్నేపటికి తెప్పరిల్లి "అబ్బాయి! చూశావురా, కోడలు ఎంతవరకు తెగించిందో"! అంది. సురేష్ తనగదిలోంచి బయటికొచ్చాడు. వనజ ప్రయాణ సన్నాహం చూసి విస్మితుడయ్యాడు. "ఇప్పుడు నేనేం అన్నానని ఆగ్రహంతో పుట్టింటికి వెళ్ళాలని చూస్తున్నావు వనజా!" అందామనుకున్నాడు కానీ, అంతట్లోనే అభిమానం ముంచుకొచ్చింది! ఈ ఆడవాళ్ళు సామాన్యులా? కనికరిస్తే కంట్లో వ్రేలు బెడదామని చూస్తారు.

మందరపు పద్మలలిత

"వెళితే వెళ్ళనియ్యమ్మా! ఆవిడ ఇక్కడ వుండి మనల్నేం వుద్ధరించాలి గనుక!" అంటూ గిరుక్కున తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

వనజ వుబికివస్తున్న కళ్ళనీళ్ళ నాపుకుంటూ వెళ్ళి రిక్షాలో కూర్చున్నది. రైల్లో ప్రయాణం చేస్తున్నంతసేపూ సురేష్ మాటలు జ్ఞాపకంవచ్చి వనజకు గుండెల్లో సూదులు పొడుస్తున్నట్టనిపించింది. ఇంటికి వెళ్ళాక వనజ తండ్రిని చూసి బావురుమని ఏడ్చింది. "నా తోటివాళ్ళంతా చక్కగా చదువుకుని సుఖపడుతుంటే పద్నాలుగేళ్ళకే ఏం కొంప ముంచుకుపోయిందని పెళ్ళిచేశావు నాన్నా? ఈ మూడేళ్ళ కాపురంలో నేను సుఖపడ్డదేం లేదు. అత్తగారి దెప్పులూ, అయ్యగారి ఆగ్రహం తప్ప మరేంలేదు నాన్నా!" అంది.

భూషణం వనజ ఏకరువు పెట్టిన కష్టాలన్నింటినీ ఆత్రుతగా విన్నాడు. కోపంతో కళ్లు ఎఱ్ఱగా చింతనిప్పుల్లా అయిపోయాయి. "ఏమిటి! నీచేత ఇంటెడు చాకిరీచేయిస్తూ పైగా నిన్ను నానా మాటలు అంటున్నారా? ఇంత డబ్బూ ముఖానపోసి వాడి కంటగట్టిన దెందుకూ, ఒక చీరాకొనక, ఒక నగా చేయించకపోయాక! బుద్ధిగడ్డితిని నీకు పెళ్ళి చేశానమ్మా! ఇప్పటికైనా మించిపోయింది లేదు! నువ్వు ఎంతవరకు చదువుకుంటానంటే అంతవరకూ చెప్పిస్తా. ఆ దరిద్రుడి ముఖం మాత్రం చూడకు!" అన్నాడు.

వనజ కలకబారిన మనస్సుతో చాలసేపు ఆ విషయమే ఆలోచించుకుంటూ కూర్చున్నది.

* * *

రోజులు గడుస్తున్నకొద్దీ వనజ ఆగ్రహం మెల్లమెల్లగా చల్లారుతూ వచ్చింది. ఏ క్షణంలోనైనా సురేష్ తనను తీసుకెళ్ళటానికి వస్తాడేమోనని వళ్లంతా కళ్ళుచేసుకుని చూడసాగింది. కానీ...లొంగిన కొద్దీ మొత్తుతూనే వుంటారు మొగవాళ్ళు! తను బింకంగా వుండకపోతే లాభంలేదుమరి! వనజ మనస్సుమాత్రం సురేష్‌కోసం తహతహలాడసాగింది. "ఏమో పాపం! నిజంగానే చేతిలో డబ్బులేదేమో, వుంటే ఎందుకు కొనివ్వరూ?" అనుకుంది ప్రేమగా! తనను నవ్విస్తూ కవ్విస్తూ ఎంత సరదాగా వుండేవాడు! మళ్ళా సురేష్ దగ్గఱకు వెళ్ళగలిగితే బాగుండును! ఆ తీయని వాక్కుల కోసం తన మనస్సు పలవరిస్తున్నది— అయినా అంతలోనే అభిమానం అడ్డు తగిలింది! ఇన్నాళ్ళై పుట్టింటిలోవున్నా ఒక సారైనా వచ్చాడా? తనే[illegible] అనరాని

★ అంతంలేని పంతం ★

మాటలు అనేసిందని అంత కోపం రావటానికి! తనను వచ్చి తీసుకెళితే అతని సొమ్మేం పోయింది? తనతో అతని కంత అవసరం లేనప్పుడు తనెందుకు 'నువ్వుతప్ప నాకు గతిలేదు' అంటూ పరుగెత్తుకుని అక్కడికి పోవాలీ అని రోషం తెచ్చుకుని వూరుకుంది.

సురేష్‌కూడా వనజమీదికి మనస్సు పోసాగింది. "పాపం! మనస్సుంచబట్టలేక కావాలని నోరుతెరిచి అడిగితే కళిరేశాను. ఇంకెప్పుడైనా కొంటానని మెల్లిగా చెప్పాల్సింది!" అనుకున్నాడు జాలిగా పశ్చాత్తాపంతో.

"వనజ లేనిదే ఏంతోచటం లేదు, వెళ్ళి తీసుకొస్తే బాగుండును!" అనుకుని మళ్ళా అంతలోనే "ఆడదానికే అంత తలబిరుసుగా వుంటే డబ్బు గడించే మొగవాడిని నాకెంత వుండాలి?" అని బిగిసి కూర్చున్నాడు. పుట్టింటికి వెళ్ళింది వెళ్ళినట్టు తిరిగిరాలేదూ? తను అక్కడ దిగబెట్టాడు గనుకనా, మళ్ళీ వచ్చి తీసుకురావటానికి? ఆవిడ అలకలు తీర్చి, భుజాన్నెక్కించుకుని తీసుకొచ్చేంత అవసరం తనకేంలేదు. వచ్చినప్పుడే వస్తుంది. రాకపోతే అక్కడే వుంటుంది! "నా అవసరం ఆవిడకు లేనప్పుడు ఆవిడతో నేనా నాకవసరం?" అంటూ కోపంతో బింకంగా కూర్చున్నాడు సురేష్.

రోజులు గడుస్తున్నకొద్దీ ఇద్దరికీ కోపం ఎంత చల్లారుతున్నదో, పట్టుదలా అంత పెరుగుతున్నది. సురేష్‌ను తల్లి అప్పుడప్పుడు మందలిస్తూనే వున్నది. "పోయి కోడల్ని తీసుకురారా? ఎన్నాళ్ళు దాన్ని అక్కడే అట్టే పెడతావ్? మొగుడూ పెళ్ళాలన్న తర్వాత పోట్లాటలు రాకుండా పోతాయా? మెల్లగా సర్దేసుకుని పోవాలిగాని ఇలా కాపురాలు మానుకుంటారటరా? ముసలిదాన్నయిపోయానా, ఇంటిపనంతా ఎన్నాళ్ళని నేను సవరించుకుని రాగలనురా? కోడలు మీద భారంవేసి హాయిగా రామా, కృష్ణా అంటూ కూర్చోవలసిన దాన్ని!"

కాని సురేష్ తన పంతం మానలేదు. ఈ పంతాలమధ్యా, పౌరుషాల మధ్యా ఒక ఏడాది యిట్టె గడిచిపోయింది. ఇరుపక్షాల నుంచీ సంధి ప్రయత్నాలేం జరుగలేదు!

వనజ మనస్సు రాయిచేసుకుని చదువులో పడ్డది ఉన్నట్టుండి హఠాత్తుగా ఒకరోజు సురేష్ తల్లి బండిలోంచి దిగింది. వనజ తండ్రి భూషణం ఆవిడను చూసి ముఖం ముడుచుకున్నాడు. వనజ మనస్సులో మాత్రం చిన్న ఆశారేఖ మెరిసింది! సురేష్ తల్లి నవ్వుతూ "బాగున్నావా అమ్మా వనజా" అంటూ పలకరించి దగ్గరకొచ్చి కూర్చున్నది. "నిన్ను తీసుకెళ్దామని వచ్చానమ్మా!" అంది వనజను పరికించి చూస్తూ. వనజ మాట్లాడే అవకాశం యివ్వకుండానే భూషణం "అమ్మాయిని తీసుకెళ్ళటానికి నువ్వు వస్తావటమ్మా? అమ్మాయిమీద అంత అభిమానం ఏడిస్తే మీ అబ్బాయే వచ్చును గా? సుఖంగావున్న దాన్ని మళ్ళా ఆ నరకంలోకి ఈడ్చుకెళ్ళాలనా మీ తాపత్రయం? ఆలనాపాలనా లేని కొంపలో అదేం సుఖపడుతుంది? నా యింట్లోనే వుంటుంది—నాతోనే తింటుంది!" అన్నాడు దురుసుగా.

సురేష్ తల్లి తెల్లబోతూ "పెద్దవారు! మీరుకూడా అలా అంటే ఎలా అన్నయ్యగారూ? చిన్నవాళ్ళ పట్టుదలకూ, పంతాలకూ పోయి కూర్చుంటే, పెద్దవాళ్ళు మనం వాళ్ళకు సర్దిచెప్పి కాపురం నిలబెట్టాలంటారా, లేదంటారా?" అంది.

"ఇంతకీ నేను కాపురం చెడగొట్టేవాడినీ, మీరు నిలబెట్టేవారునా? సురేష్‌నే వచ్చి తీసుకెళ్ళమనండి! ఆ పంతం ఏమిటో నేనూ చూస్తాను! వాడు వస్తేనేగాని అమ్మాయిని పంపేది లేదు!" అన్నాడు ఖచ్చితంగా.

సురేష్‌తల్లి చాపమీదనుంచి లేస్తూ "వనజా నీకు కాపురం నిలబెట్టుకోవాలంటే పంతానికిపోకుండా నీ అంతట నీవైనా వచ్చేయమ్మా" అంది.

భూషణం మండిపడ్డాడు. "బాగానూరి పొయ్యండి! దాని జీవితాన్ని సరిదిద్దవాడిని నేనుండగా మీరెందుకు మధ్యలో కలుగ



జేసుకోవటం?" అని వనజవేపు తిరిగి "వనజా! ఆ గడపత్రొక్కావా మళ్ళా జన్మలో నీ ముఖం చూసేది లేదు!" అన్నాడు.

వనజ అత్తగారితోపాటూ వెళ్ళిపోవాలనే అనుకుంది. అయినా ఆగ్రహంతో మండిపడుతున్న తండ్రిముఖంచూసి అంతపని చేయటానికి సాహసించలేకపోయింది.

తర్వాత కొన్నాళ్ళు గడిచాక తండ్రితో మెల్లిగా ఆ విషయం కదిపింది.

"నీ చదువు మధ్యలో పాడుచేయటాని కమ్మా ఈ ఎత్తంతా! అటు నిన్ను చదువుకూ కాకుండా, ఇటు కాపురానికీ కాకుండా చేయాలని వాళ్ళ సంకల్పం! నా మాట విని వాడి పేరెత్తక చక్కగా చదువు పూర్తిచేసుకో! ఏదో ఒకటి నిశ్చయం చేసుకో అక్కడికి వెళ్ళావా ఎలాగోలా ని కాపురం నీవే చక్కబెట్టుకుని అక్కగపడుండు. లేదా హాయిగా చదువు చెప్పిస్తాను. వుద్యోగం చేసుకో! ఆ దరిద్రుడి పేరెత్తితేనే నాకు వళ్ళుమండుతున్నది. ఏడాదై పుట్టింటిలోవుంటే ఒకసారైనా వచ్చిందీ, బ్రతికింది కనుక్కున్నాడా? అలాంటి వాడింటికిపోయి ఏం సుఖపడతావు చెప్పు" అని భూషణం వనజతో అన్నాడు నచ్చజెప్పే ధోరణిలో.

వనజ, తండ్రిమాట కాదని తెగించి సురేష్ దగ్గఱకెళ్ళటానికి జంకింది. ఇదమిద్ధంగా ఏదీ తేల్చుకోలేక గాఢంగా నిట్టూర్చింది. ఆ క్షణంలో సురేష్ దగ్గఱకు పరుగెత్తుకునిపోయి అతని పాదాలకు ప్రణమిల్లితే బాగుండుననిపించింది వనజకు. తండ్రికి అసలేపట్టుదల! తను ఈ ఊబిలోనుంచి ఎప్పటికీ బయటపడలేకపోతేనో?

* * *

సురేష్, మామగారింట్లో తల్లికి జరిగిన గౌరవ మర్యాదలు గురించి విన్నాడు. ఆడపిల్లనుకన్న అభాగ్యుడికే అంతపట్టుదలైతే తనేనా తక్కువవాడు? వనజను తను స్వయంగా ఎందుకు తీసుకురావాలి? తప్పు చేసివుంటే క్షమార్పణ కోరినా అందం! డబ్బుంటేమాత్రం అంత అహంకారమా? తన కూతుర్ని తను దిగబెట్టి వెళ్ళ లేడూ? పొరబాటున చేసుకున్నాడీ సంబంధం!.

సురేష్‌కు ఆలోచిస్తున్న కొద్దీ వనజ తండ్రిమీదా తత్ఫలితంగా వనజమీదా బాగా ద్వేషం పెరిగిపోయింది. చివరకు ఆ ద్వేషం వనజమీద విడాకులకోసం దావా వేయటం వరకూ వచ్చింది. వనజ ఈ సంగతి విని చాలాగా బరాపడింది. ఏడుస్తూ మూటా, ముల్లెకట్టుకుని ప్రయాణానికి సిద్ధమయ్యింది. రిక్షా బయల్దేరే సమయంలో భూషణంకూడా వనజతో ప్రయాణం అయ్యాడు. వనజను బుజ్జగిస్తూ "విడాకులిస్తే పీడా వదిలిందనుకోమ్మా! నీకేం భయంలేదు! నీకు ఇంకో

ఉగాది ఉత్సవాల సందర్భంలో చెన్నపురి ఆంధ్ర మహాసభవారు జరిపిన నాటికల పోటీలలో, శ్రీ గన్నిశెట్టి వేంకటేశ్వరరావు రచించిన "ఏమి జీవితాలు" నాటికలో సుబ్బారావు పాత్ర ధరించి ఉత్తమనటుడుగా ఎన్నికైన విల్లివాకం ఆంధ్ర సంఘ కార్యదర్శి శ్రీ బి. రామకృష్ణ.

పెళ్ళి చేస్తాను, చూస్తూండు!" అన్నాడు.

వనజ అదిరిపడి చూసిందే తప్ప ఏమనలేకపోయింది. "ఇంటికిపోదాం పదమ్మా! వాడికసలే నీమీద కోపం! నువ్వు ఇప్పుడు అక్కడ వెళ్ళావంటే పీకపిసికి చంపుతాడు కూడా! మరేం భయంలేదమ్మా! నీ జీవితాన్ని సరియైన దారిలో నేను పెడతాను కదా తల్లీ!" అంటూ సముదాయించాడు.

రిక్షా వెనక్కుమళ్ళింది. వనజ ఏదో మాట్లాడాలని గింజుకుంది. కాని ఒక్కమాటా పెదిమలుదాటిరాలేదు. కన్నీరు కారుస్తూ నిరాశగా, నిస్పృహగా రిక్షాకు నీరసంగా జారగిలబడింది వనజ.

* * *

వనజ ఎం. బి. బి. యస్. పూర్తి చేసింది. తండ్రి భూషణం వనజ దగ్గరే వుంటున్నాడు. వనజకు మళ్ళా పెళ్ళిచేసుకోవాలనే వుద్దేశ్యం వుందో, లేదో కాని తండ్రిమాత్రం వనజకు మళ్ళా పెళ్ళి చెయ్యాలని శత విధాలా ప్రయత్నం చేస్తున్నాడు. భూషణం ఎక్కని గుమ్మం లేకుండా పోయింది. ఎక్కడ చూసినా నిరాశే ఎదురౌతున్నదిగానీ ఫలితం లేకపోతున్నది. ఆడపిల్లకు పెళ్ళి చేయటమే బ్రహ్మాండం! అందులో రెండో పెళ్ళి, మూడు నాలుగేళ్లు కాపురం చేసిన దానిని పెళ్ళి చేసుకునేంత వుదారులు విదేశాల్లో తప్ప మన దేశంలో లేరేమో!

ఎవరో ఇంజనీర్ గారికి పెళ్ళికుమార్తెకోసం గాలిస్తున్నారు! వాళ్ళది ఆదర్శ కుటుంబమని పేరు. ఇంజనీర్ అన్నగారు వితంతు వివాహం చేసుకున్నారు. భూషణం ఆశతో వాళ్ళింటికి వెళ్ళాడు. ఆ ఇంజనీర్ గారి తండ్రి భూషణం సంగతి ఇదివరకే విన్నాడు. విడాకులు జరిగిన తర్వాత భూషణంపేరు నలుగురి నోళ్ళలోకీ బాగా ప్రాకిపోయింది. కూతురు కాపురం చేజేతులా చెడగొట్టాడని నలుగురూ నానా మాటలూ ఆడారు. అయినా భూషణం లోకానికేం వెఱువలేదు!

ఇంజనీర్ తండ్రి సంగతంతా విని "బాబూ! అయితే వారికి విడాకులిచ్చినట్టే మాకు మాత్రం మీరు విడాకులివ్వరని ఏం నమ్మకం? మీతో పేచీలు పడటానికి మాకేం ఓపిక లేదండీ?" అన్నాడు.

దాంతో భూషణం తలవంచుకుని బైటికి చక్కగా వచ్చేశాడు. ఈ సంగతి చూచాయగా తెలిసి వనజకంటికీ, మంటికీ ఏకధారగా ఏడ్చింది. అనుకోకుండా ఎంత పొరబాటు పనిచేసింది తనూ?

ఇంకో పెళ్ళికొడుకు "రెండో పెళ్ళంటున్నారుకదా! పదివేలు కట్నమైనా ఇవ్వరా?" అనడిగాడు.

వనజ మనస్సులో ఎంతో బాధపడింది. ఆడదాని బ్రతుకెంత నికృష్టం!

వనజకు లేడీ డాక్టరుగా వైజాగ్‌లో పోస్టింగు వచ్చింది. ఉన్నది ఇద్దరే కాబట్టి, తోడుకోసం ఒకరి ఇంట్లో భాగం అద్దెకుతీసుకున్నది. ఆ ఇల్లు గలావిడ శకుంతల చాలా మంచి మనిషి. వనజతో ఆప్యాయంగా మనసువిప్పి మాట్లాడుతుంది. వనజ శకుంత

(47-వ పేజీ చూడండి)

హిరణ్యాక్షవరం

ఒహోయన బాగా అలసిపోయి కాళ్ళీడ్చుకుంటూ మంగలిపాపు లోకివచ్చి కుర్చీలోకూలబడ్డాడు.

గడ్డం చెయ్యమన్నాడు.

"బాగా కిందకున్నారు— కొంచెం పైకికూచుంటే గడ్డం చెయ్యడానికి వీలుగావుంటుంది" అన్నాడు మంగలి.

"ఓపికలేదు—అయితే క్షవరమే చేసెయ్."

★ అంతంలేని పంతం ★

(19 వ పేజీ తరువాయి)

లతో మాట్లాడుతుంటే మనసులోని బరువూ, వేదనా తగ్గినట్టువుంటుంది. తీరిక చిక్కినప్పుడల్లా శకుంతల వనజదగ్గరకెళ్ళి ఏవేవో మనస్సు కుల్లాసం కలిగించే కబుర్లు చెపుతూ వుంటుంది.

ఒకరోజు వనజ డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు. ఇంతలో చెప్పులసవ్వడి వినిపించి వనజ తలెత్తిచూసింది. "ఇక్కడున్నావా శకుంతలక్కా?" అంటూ నవ్వుతూ ఓ అందమైన ఆవిడ పాపాయినెత్తుకుని లోపలికి కాలు పెట్టింది.

శకుంతల "రా, రా! మంచిసమయానికే వచ్చావు సరోజా! నీకిన్నాళ్ళనుంచీ వీరిని పరిచయం చేయాలంటే ఎప్పుడూ తటస్థపడనేలేదు. వీరే సరోజా, డాక్టర్ వనజాదేవి!" అంది.

సరోజ ఆప్యాయంగా చిరునవ్వు చిందిస్తూ "మిమ్మల్ని కలుసుకోగలటం నా అదృష్టం!" అంది. చేతిలోని కుంకుమభరిణె తెరిచి వనజకు బొట్టుపెడుతూ "రేపు మా అబ్బాయి పుట్టినరోజు పండుగ! మీరుతప్పక రావాలండీ! మీరు రాకపోతే నేనే స్వయంగావచ్చి మిమ్మల్ని తీసుకెళతాను! ఏం శకుంతలక్కా? నువ్వు వీరిని నీతో తీసుకురాకపోవాలీ, అప్పుడుంటుంది లే నీపని!" అంది సరోజ కోమలంగా దరహాస చంద్రికలు ప్రసరింపచేస్తూ.

శకుంతలతోనూ, వనజతోనూ మరీ మరీ చెప్పి సరోజ ఇంటికి వెళ్ళిపోయింది. సన్నగా, నాజూగ్గా అందమైన కోలముఖంతో కలకలలాడుతున్న సరోజరూపం వనజ మనస్సులో చాలాసేపటివరకూ తారట్లాడుతూనేవుంది.

మర్నాడు వనజ వీలుచేసుకుని శకుంతలతో సరోజఇంటికి పేరంటాని కెళ్ళింది. సరోజ ఆప్యాయంగావచ్చి పలకరించింది. పేరంటాళ్ళంతా సందడిగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. సరోజ చంటిపిల్లాడిని ఎత్తుకునే అన్నీ సవరించుకుంటున్నది. మిగతా ముగ్గురుపిల్లలూ అటూ, ఇటూ తిరుగుతూ అల్లరిచేస్తున్నారు. సరోజ ఒక్కొక్కరినే దగ్గరకుపిలిచి చూపించింది. వనజకు వాళ్ళందరినీ చూస్తూంటే ఏదో మధురమైన వింత అనుభూతి కలిగింది. చటుక్కున సరోజచేతిలో పిల్లాడిని తీసుకుని ముద్దుపెట్టుకున్నది. అందరూ వెళ్ళాకకూడా సరోజ వనజను ఇంటికి వెళ్ళనిచ్చిందికాదు. "మీరు రావటానికే కుదరదు. వచ్చినప్పుడైనా మరోగంట కూర్చోకుండా వెళితే ఎలా?" అని బలవంతంచేసి శకుంతలనూ, వనజనూ కూర్చోపెట్టేసింది.

వనజలేచి గోడమీది ఫోటోలు చూడసాగింది. సరోజ వనజప్రక్కనే నించుని ఒక్కొక్క ఫోటోగురించి చెప్పసాగింది.

ఉన్నట్టుండి వనజ వులిక్కిపడింది. సురేష్, సరోజా, పిల్లలూ తీయించుకున్న ఫోటో అది! సరోజముఖంలో సిగ్గుదొంతరలు సన్నగా నాట్యం చేశాయి. "నేనూ, మావారూ, పిల్లలూ" అందమెల్లగా సరోజ! సరోజ వదనంలోని ప్రఫుల్లత, అనురాగం చూసి వనజ మనస్సెందుకో చిన్నబుచ్చుకుంది. కొంతదూరంలో చిన్నప్పుడు సురేష్, తనూతీయించుకున్న ఫోటో తగిలించి వుంది. సరోజ ఆ ఫోటోకేసి చూపిస్తూ "ఈవిడ మా వారి మొదటి భార్య! మహాగయ్యాళి అటలెండి! అయినదానికీ, కానిదానికీ పోట్లాటలు పెట్టేసి పుట్టింటికి వెళ్ళిపోయేదట! వారసలు ఎంతో శాంతంగా సరదాగా వుంటారుకదా! అలాంటి దివారితోనే ఆవిడకు పడలేదట! చిత్రమైన మనుష్యులుంటారండీ! వీరికి విడాకులిచ్చేసి ఏదో చదువు వెలగబెట్టిందట! పెళ్ళికూడా చేసుకుందేమోలెండి, మళ్ళా ఎవడికొంపతియ్యటానికి! అలాంటివాళ్ళ ముఖం చూసినా పాపమేసుమండీ! నీతి నిజాయితీ లేకపోయాక ఎందుకొచ్చిన బ్రతుకు చెప్పండి?" అంది సరోజ.

వనజకు కాళ్ళక్రింద భూమి కదులుతున్నట్టనిపించింది. తల దిమ్మెక్కినట్టయింది వనజనుచూసి సరోజ గాబరా పడింది. "ఏమండీ! అలావున్నారేం?" అంది వనజ కొంత తెప్పరిల్లి "మరేంలేదు! తల తిరుగుతున్నట్టుంది. ఇంటికివెళ్ళి కాస్సేపువిశ్రాంతి తీసుకుంటే అదే పోతుంది!" అంటూ శకుంతలతో హడావుడిగా ఇంటికి బయల్దేరింది. వనజా, శకుంతలా గుమ్మంలోకి వచ్చేసరికల్లా ఎవరో గేటుతలుపు తీసుకుని లోపలకు వస్తున్నారు. చేతిలో మల్లెపూల వాసన ఆమడదూరందాకా వేస్తున్నది. వనజ ఆ వ్యక్తిని తేరిపారచూసి మనస్సులోనే నిట్టూర్చింది స్నేహపూర్వమైన ఆ సుందర వదనంలోని ప్రశాంతత, ప్రసన్నత చూసి వనజ ఆవేదనకు లోనయ్యింది. ఆ నాడు తను అంత పొరపాటు పనిచేయకపోతే సరోజలానే తనూ పిల్లలతో, భర్త అనురాగంతో కలకలలాడుతూ జీవించేదికదా?

ఇంటికి వెళ్తూండగా త్రోవలో "మల్లెపూలు కొంటారామ్మా?" అనడిగాడు ఒక కుర్రాడు పూలతట్ట నెత్తిని పెట్టుకునివస్తూ. వనజ త్రుళ్ళిపడి చూసింది! ఎందుకో హఠాత్తుగా సురేష్‌చేతిలోని మల్లెపూలు జ్ఞాపకం వచ్చాయి. ఈపాటికి అవి సరోజ జడను అలంకరించే వుంటాయేమో! ఈనాడు తనూ ఎవ్వరినీ అడక్కుండా అన్నీ తనే కొనుక్కోగలదు! అయితే సాటిలేని అనురాగం కొందామనుకున్నా ఎక్కడ దొరుకుతుంది? తన తండ్రి తనను ఎందుకూ కొరగానిదానిగా చేశాడు! ఇంటికి వెళ్ళాకకూడా వనజమనస్సు ఏం బాగుండలేదు.

రాత్రంతా వనజ వికలమైన మనస్సుతో అపరిమితంగా బాధపడింది. తెల్లవారిన తర్వాత డ్యూటీకి వెళ్ళలేక సెలవు పెట్టేసింది. సరోజ తనను అన్న మాటలు శూలాల్లా గ్రుచ్చుకున్నట్టుగా కలతచెందింది వనజ.

సాయంకాలం తండ్రి తనతో పదిమందిని వెంటేసుకునివచ్చాడు. సంతోషంతో వురకలు వేసుకుంటూవచ్చి "వనజా! ఆ కాల్టెక్స్ కంపెనీలో పనిచేసే ఆయన పెళ్ళికి వప్పుకున్నాడు. వాళ్ళు నిన్ను చూడ్డానికి వచ్చారు! త్వరగా సిద్ధంకా!" అన్నాడు.

వనజ మౌనంగా ఆలోచిస్తూ వించున్నది ఆర్థికస్వాతంత్ర్యంవుంటే మరేం అక్కరలేదనుకున్నది తను ఒకనాడు! కాని యీనాడు తను లెక్కలేనంతడబ్బు గడిస్తున్నా ఏమిటో చెప్పలేని వెలితి! ఆ శూన్యాన్ని ఎవరూ పూరించలేరు. ఆసంగతి తనకు తెలియనే తెలుసు! 'నిత్యకల్యాణం పచ్చతోరణంలా' వుండాల్సిన తన జీవితాన్ని ఎడారిలా మార్చుకుంది. జీవితంలో అమూల్యమైనదాన్ని 'ఏదో' తను పోగొట్టుకున్నది! ముప్ఫైఏళ్ళ వయస్సులో తను పెళ్ళిచేసుకుని ఏం సుఖపడుతుంది? అతన్నేం సుఖపెడుతుంది? యౌవనమంతా వ్యర్థంగా శోకంతోనే గడిచిపోయింది. ఇంక మరి... ఇప్పుడు పెళ్ళిదేనికి? సరోజ మాటలు తనను శూలాల్లా పొడుస్తూన్నాయి! తను చేసింది పొరబాటే! అయినా ఎప్పటికప్పుడు దిద్దుకోవాలనుకున్నా తండ్రి కఠినుడై కఠోరంగా అడ్డు నిలిచాడు! తనింకేంచేయగలదు మరి! చూస్తూ, చూస్తూ తన జీవితాన్ని పాడుచేసుకోవటంతప్ప మరేం చేయలేకపోయింది.

"త్వరగా తెమిలిరా వనజా! అవతల వాళ్ళొచ్చి అప్పుడే అరగంటపైనఅయ్యింది." అంటూ భూషణం మరోసారి లోపలికొచ్చాడు.

వనజ సంతతధారాపాతంగా కారుతున్న కన్నీళ్ళను తుడుచుకుంటూ "నాజీవితాన్ని నిర్దయగా నలిపేశావు నాన్నా! ఈ మిగిలిన కాస్త జీవితానికి కూడా శాంతి లేకుండా చెయ్యకు! వాళ్ళని వెళ్ళిపొమ్మను చెప్పనాన్నా! నాకు నీవు జన్మలో చేసే వుపకారమేదైనా వుంటే, ఇదొక్కటే నాన్నా!" అంటూ గబగబా తన గదిలోకి వెళ్ళిపోయింది, తెల్లబోతూనించున్న భూషణాన్ని నిర్లక్ష్యంచేసి— ★